క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి మింది హైస్కూల్ విద్యార్థిని


శ్రీ హర్షిత

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని మేదబోయిన శ్రీ హర్షిత ట్రిపుల్ ఐటీకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ తెలిపారు. 10వ తరగతిలో 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించిన ఆమెకు శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందని తెలిపారు.

రేపు ఉచిత ఆధార్, ఈ శ్రమ్ కార్డు క్యాంపు

గాజువాక : గాజువాక లయన్స్ క్లబ్, ప్లానెట్ 9 సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత ఆధార్, ఈ శ్రమ్ కార్డు క్యాంపులను నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్యాల కోటేశ్వరరావు, బలివాడ సత్యారావు తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచితంగా ఆధార్ నమోదు చేస్తారన్నారు. ఈ శ్రమ్ కార్డు చేయించుకోదలచినవారు తమ బ్యాంక్ పాస్ బుక్‌ను తీసుకురావాలని సూచించారు. వివరాల కోసం 9989087875 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అదనపు అంతస్తు తొలగింపు


తిరుమల నగర్‌లో అదనపు అంతస్తును తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కూర్మన్నపాలెం: అక్రమ నిర్మాణాలపై జీవీఎంసీ కొరడా ఝుళిపిస్తోంది. 87వ వార్డు తిరుమల నగర్‌లో అనుమతుల్లేకుండా నిర్మించిన అదనపు అంతస్తులను జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ఏసీపీ మహాపాత్రో నేతృత్వంలో డీపీవో రేవతి ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్నారు. అధికారులు మాట్లాడుతూ అనుమతికి విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని హెచ్చరించారు.

దేవాడ పీహెచ్‌సీలో హెల్త్ మేళా


హెల్త్ మేళాలో పాల్గొన్న వైద్యాధికారి ప్రదీప్ రాజా

పెదగంట్యాడ: దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ మేళా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రాజా మాట్లాడుతూ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. నార్మల్ డెలివరీ, హెపటైటిస్, ట్రాన్స్‌మిషన్, కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, అన్నపూర్ణ, విజయభాను, దేవి, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ రిలే నిరాహార దీక్షలు


రిలే దీక్షల ప్రారంభ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు

ఉక్కునగరం: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపోలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలో జి. సాయిరామ్, జి.ఎస్. రావు పాల్గొన్నారు. రీజనల్ కార్యదర్శి నీలకంఠం, జోనల్ చైర్మన్ ఎం.సూర్యం, డిపో అధ్యక్షుడు జి.ఎస్.ఆర్. కృష్ణ దీక్షలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులకు వరం.. జగనన్న సురక్ష


88వ వార్డులో మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి


77వ వార్డులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ప్రతీ దరఖాస్తు పరిష్కారమే లక్ష్యంగా సేవలు
- గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అగనంపూడి: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. దరఖాస్తులో పేర్కొన్న ప్రతీ సమస్య పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. 88వ వార్డు మంగళపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ధ్రువపత్రాల మంజూరుకు సంబంధించి 122 మంది దరఖాస్తు చేసుకోగా, 110 దరఖాస్తులు పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. 85 మందికి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారన్నారు. అర్హత ఉండి, ప్రభుత్వ పథకాలు అందని వారికి ఈ కార్యక్రమం వల్ల లబ్ధి చేకూరుతుందన్నారు. శిబిరంలో నమోదు చేసుకున్న వాటిలో దాదాపు అన్ని అర్జీలు పరిష్కారం అయ్యాయన్నారు. ఇళ్ల ముంగిటకు సేవలు దరి చేర్చిన ముఖ్యమంత్రి, సేవా నిరతితో పనిచేస్తున్న వలంటీర్లను నిత్యం ఆడిపోసుకుంటున్న ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఆదరణ పెరుగుతుండడంతో ప్రతిపక్షాలు, వాటికి అనుబంధంగా ఉన్న మీడియా విషయం చిమ్ముతున్నాయని ఆరోపించారు. ప్రతీ ఇంటికి సంక్షేమాన్ని చేరువ చేసిన ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. దువ్వాడ సెక్టార్-1, సెక్టార్-2, కాపు జగ్గరాజుపేట మంగళపాలెం వార్డు సచివాలయాలకు సంబంధించి నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ పొందూరు సింహాచలం, గాజువాక తహసీల్దార్ పాల్‌కిరణ్, ఏపీడీ రాము, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ గంట్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ బొప్పా నాగరాజు, గాజువాక జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, సీనియర్ నాయకులు దాడి నూకరాజు, నమ్మి ప్రసాద్, శనివాడ రాము, ప్రమీలారావు తదితరులతో పాటు అధికారులు, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

77వ వార్డులో 140 మందికి ధ్రువపత్రాలు

పెదగంట్యాడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు దరి చేర్చాలన్న సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 77వ వార్డు నమ్మిదొడ్డి జంక్షన్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక, ఇతరత్రా కారణాల వల్ల ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయని, మిగిలిన ఒక్క శాతం ఎవరైనా అర్హులు ఉంటే వలంటీర్లు ఇంటింటా జల్లెడ పట్టి మరీ గుర్తించి పథకాలు అందిస్తారని చెప్పారు. వాటి కోసం ఏమేం ధ్రువపత్రాలు కావాలో వివరాలు నమోదు చేసుకుంటున్నారని, వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటి వద్దే ఉచితంగా అందుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటింటి సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న పెదపాలెం, కె.ఎస్.పాలెం, నమ్మిదొడ్డి, గొల్లపేట సచివాలయాల పరిధిలో 140 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, తహసీల్దార్ రమాదేవి, జెడ్పీ సింహాచలం, ఏపీడీ రాము, మద్ది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లోనే ధ్రువపత్రం



గతంలో కుల ధ్రువీకరణ పత్రం కోసం గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాం. పని కాలేదు. దీంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేస్తే, మూడు రోజుల్లోనే ధ్రువపత్రం సిద్ధమైందని వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ సమాచారమిచ్చారు. నేడు ఎమ్మెల్యే చేతులమీదుగా ధ్రువపత్రం అందుకున్నాం.

– మాడిశ దేముడమ్మ, జగ్గరాజుపేట

పేదలకు మేలు



జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరంగా మారింది. ధ్రువపత్రాల కోసం వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుని, త్వరగా పత్రాలు కావాలంటే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఈ కార్యక్రమం గురించి వలంటీర్ల ద్వారా తెలుసుకుని దరఖాస్తు చేసిన రెండు రోజుల్లో ఆదాయ ధ్రువపత్రం అందించారు. సంతోషంగా ఉంది.

– ప్రమీలారావు, జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ

సేవే పరమావధిగా..

- పని చేస్తున్న వలంటీర్లు
- లబ్ధిదారుల ప్రశంసలు


అక్కిరెడ్డిపాలెంలో వృద్ధురాలు ఎస్.కె.హసీనాబీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సీహెచ్.వరలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం: సేవే పరమావధిగా పని చేస్తూ.. కుటుంబాలకు సంక్షేమ పథకాలను చేరవేస్తూ పేదలకు భరోసా కల్పిస్తున్నారు వలంటీర్లు. ప్రతీ ఇంటికీ వెళ్లి, ఆత్మీయంగా పలకరిస్తూ కుటుంబంలో భాగమైపోయారు. వారి సేవలపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.

'చేయూత'నిచ్చారు



మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. భర్త ప్రైవేట్ పనులు చేస్తుంటారు. అమ్మాయి పెళ్లి అనంతరం ఆర్థికంగా కొంత ఇబ్బంది వచ్చింది. మా అబ్బాయి చదువుకు కూడా కష్టమైంది. ఆ సమయంలో వలంటీర్ ప్రసన్న జగనన్న చేయూత పథకం గురించి తెలియజేసి, దరఖాస్తు చేయించారు. పథకం మంజూరు కావడంతో ఇంటి వద్దనే చిన్న వ్యాపారం చేస్తున్నా. పథకం వర్తింపులో వలంటీర్ చేసిన కృషి మర్చిపోలేం.

– సీహెచ్.సత్యవతి, అక్కిరెడ్డిపాలెం

ఎంతో భరోసా కల్పిస్తున్నారు



అమ్మ, నేను ఇద్దరమే ఇంట్లో ఉంటాం. వృద్ధాప్యం కారణంగా ఇంటికే పరిమితమైంది. వలంటీర్ లక్ష్మీ ప్రసన్న ప్రతీ నెలా 1వ తేదీనే వచ్చిన పింఛన్ అందిస్తుంది. కరోనా సమయంలోనూ ఎంతో ధైర్యం చెప్పేది. బయటికి రాలేని పరిస్థితుల్లో ఆమె చాలా అండగా ఉన్నారు. కరోనా సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు వివరిస్తూ ఎంతో భరోసా ఇచ్చారు. ఇప్పటికీ ఆరోగ్య సమస్యలపై ఆరా తీస్తుంటారు. మాకు ఎంతో ఆప్తురాలయ్యారు.

– ఎస్.కె.సైదాబీ, అక్కిరెడ్డిపాలెం

అగనంపూడిలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించాలి


వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పూర్ణ

అగనంపూడి: అగనంపూడిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణమండపం నిర్మించాలని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని వినతిపత్రంలో కోరారు. విశాఖ విమానాశ్రయంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. సుమారు 6లక్షల జనాభా ఉన్న గాజువాక నియోజకవర్గ పరిధిలో పేద, మధ్యతరగతి ప్రజలకు కల్యాణమండపం అందుబాటులో లేదని తెలిపారు. అగనంపూడి నిర్వాసిత కాలనీ డొంకాడలో అనువైన స్థలం ఉన్నందున కల్యాణ మండపం నిర్మాణం చేపట్టే అంశాన్ని పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో పెదిరెడ్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో దళితులకు సముచిత స్థానం


మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను తన కుటుంబంలా భావించే నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి వారికి వర్తించిన సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు, దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ పవన్‌కల్యాణ్‌లకు దళితులంటే చిన్నచూపు అన్నారు. వీరిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేసే వ్యక్తులని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు ఈగలపాటి యువశ్రీ, పెట్ల అప్పారావు, కుమార్, టి.ఎల్.నర్సింగరావు, విరోతి రాము, కె.సన్యాసిరావు, ఎల్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ నిధులు


ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఎంపీ నిధుల నుంచి రూ.60 లక్షలు మంజూరు చేశారు. నెల్లిముక్కులో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని స్థానిక నాయకులు ఇటీవల ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా.. వారు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను నిధులు మంజూరు చేయాలని కోరారు. స్థానిక నాయకులు ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీ ఎంవీవీ వెంటనే రూ.60 లక్షలు మంజూరు చేశారు. ఎంపీని కలిసిన వారిలో గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకట రమణారెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి అప్పలరెడ్డి, పులి రాజారెడ్డి తదితరులున్నారు.

నూతన పాఠ్యాంశాలపై సన్నద్ధం చేస్తాం

గాజువాక : ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నూతన పాఠ్యాంశాలపై ఈ నెలాఖరులో శిక్షణ నిర్వహించనున్నట్టు గాజువాక ఇండస్ట్రియల్ ఏరియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) అధ్యక్షుడు పి.భాస్కరరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన తమ కార్యవర్గ సమావేశం అనంతరం సమావేశ వివరాలను ఆయన వివరించారు. విద్యాబోధనలో వస్తున్న మార్పులకనుగుణంగా ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులను సిద్ధం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కోశాధికారి డి.శ్రీనివాస్, ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛ విశాఖకు సహకరించాలి



మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్

అగనంపూడి: స్వచ్ఛ విశాఖకు ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ కోరారు. 85వ వార్డు గొన్నా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశుభ్రమైన విశాఖను రూపొందించేందుకు జీవీఎంసీ చేస్తున్న కృషికి తోడ్పాటునందివ్వాలన్నారు. గొన్నా విద్యాసంస్థల యజమాని గొన్నా హేమ్‌చంద్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తలచుకుంటే ఏ కార్యక్రమం అయినా విజయవంతమై తీరుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్.మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

పెదగంట్యాడ: ప్రజలకు అవసరమైన చిన్న చిన్న సేవలను వారి ముంగిటకే తెచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జేసీఎస్ మండల ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని నూకాలమ్మ ఆలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, ఎంఎల్‌వోలు వెంకటేష్, రోహిత్, నాయకులు మంత్రి శంకర నారాయణ, కాకినాడ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు


దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన దరి స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కార్మికుల ఆందోళనకు మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ పోర్టు కార్మికుల సమస్య చాలా సున్నితమైందన్నారు. 11 రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రెండు రోజుల్లో ఢిల్లీ వెళ్లి ఎంపీ జీవీఎల్ నరసింహారావును కలుస్తామన్నారు. అవసరమైతే ఒకరిద్దరు కార్మికులను తన సొంత ఖర్చులతో ఢిల్లీ తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కార్యక్రమంలో పేర్ల అప్పారావు, రంజిత్, సత్యానందం, తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, నొల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి


ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి నష్టం కలిగించేలా ఉన్న గంగవరం పోర్టు యాజమాన్యం వైఖరిని మార్చుకోవాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి హితవు పలికారు. యూనియన్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సముద్ర మార్గం ద్వారా ప్లాంట్‌కు వచ్చే ముడి పదార్థాలను దిగుమతి చేసుకోవడానికి వీలుగా ఉంటుందని నాడు ప్లాంట్ యాజమాన్యం గంగవరం పోర్టు నిర్మాణానికి భూములను ఇచ్చిందన్నారు. ఆనాడు ప్రభుత్వం 10 శాతం వాటాను కలిగి ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పరిగణనలోనికి తీసుకునేదన్నారు. ఆ వాటాను రాష్ట్ర ప్రభుత్వం కోల్పోవడం వల్ల అదానీ యాజమాన్యం ప్లాంట్ ఉత్పత్తికి నష్టం కలిగేలా వ్యవహరిస్తోందన్నారు. తక్షణం ఆ చర్యలను ఆపకపోతే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరాజు, గంగాధర్, మరిడయ్య, టి. పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ సిబ్బంది చేసిన కవాతును సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కవాతుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని, 8వ బెటాలియన్‌లో ఉన్నపుడు పరేడ్‌కు మరింత ప్రాధాన్యత ఇచ్చేవాడినన్నారు. 2006లో రాష్ట్ర స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పరేడ్ కమాండర్‌గా చేయడం కారణంగా తనకు కవాతుపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఏఆర్ సిబ్బంది చేసిన కవాతును, టర్న్ ఔట్‌ను అభినందించారు. ఏఆర్ సిబ్బంది బందోబస్తుల కంటే ఎక్కువగా ప్రిజన్ ఎస్కార్ట్ డ్యూటీలు, గార్డు డ్యూటీలు, వీఐపీ ఎస్కార్ట్‌లు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివాస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిబ్బందికి శాఖాపరమైన అంశాలలో ఏదైనా సమస్య ఉంటే నెలలో కచ్చితంగా ఒక శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని వివరించారు. సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రీవెన్స్ ఏర్పాటు చేసి 11 మంది నగర ఏఆర్ సిబ్బంది నుంచి వినతులు తీసుకొని వాటి పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో త్రిశక్తి అమ్మవార్లు


మహా దుర్గాదేవి


మహా లక్ష్మీదేవి


మహా సరస్వతి


వాసవీ కన్యకాపరమేశ్వరి

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో మహాలక్ష్మి, మహా దుర్గాదేవి, మహా సరస్వతి అమ్మవార్లు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో పూజల అనంతరం మహిళలు కుంకుమార్చన చేశారు. విశేష, దీప నక్ష హారతులు, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి

పెదగంట్యాడ: 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో కొలువుదీరిన కన్యకా పరమేశ్వరి అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మొగలపల్లి శ్రీమూర్తులు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

ఉక్కు దీక్షలకు కాంగ్రెస్ నాయకుల సంఘీభావం


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో 883వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దీక్ష శిబిరంలో కాంగ్రెస్ నాయకులు వేగి వెంకటేష్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవింద్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. వేగి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందన్నారు. త్వరలోనే రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఉక్కు పరిరక్షణ కోసం పాదయాత్ర చేస్తారని, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ఉక్కు పరిరక్షణ కోసం విశాఖ వస్తారని తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


గాజువాక పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భిణులను గుర్తించి, వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. గాజువాక పీహెచ్‌సీని శుక్రవారం సందర్శించిన ఆయన, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. గర్భిణులను గుర్తించి డాక్టర్ సలహా మేరకు ఐరన్ మాత్రలు, పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పీహెచ్‌సీలో ఓపీ రిజిస్టర్, ఫార్మసీ స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. నోడల్ అధికారి డాక్టర్ ఎస్.రమ, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.